క్లుప్తంగా

ఆర్‌బీఎస్ కన్వీనర్ రాజీనామా

ఖానాపురం: రైతుబంధు సమితి (ఆర్‌బీఎస్) మండల కోఆర్డినేటర్ కుంచారపు వెంకట్‌రెడ్డి పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన రాజీనామా పత్రాన్ని జిల్లా వ్యవసాయ అధికారికి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. సాధారణ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి, బీఆర్‌ఎస్ ప్రభుత్వ ఓటమి పాలవడంతో తాను తన పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు. పదవి సమయంలో తనకు సహకరించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయ చైర్మన్ పదవికి..

పరకాల: రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో పాటు ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఓటమి చెందటంతో పట్టణంలోని శ్రీకుంకుమేశ్వరస్వామి ఆలయ చైర్మన్ పదవీకి గందె వెంకటేశ్వర్లు రాజీనామా చేశారు. త్వరలో ప్రారంభం కానున్న షష్టి జాతర, నెల రోజుల్లో జరుగనున్న శివరాత్రి కల్యాణ మహోత్సవాలను వైభవంగా నిర్వహించాల్సిన సమయంలో రాజీనామా చర్చనీయాంశంగా మారింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఖానాపురం: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన ఘటన మండల కేంద్ర శివారులో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన వీరస్వామి ద్విచక్ర వాహనంపై జాతీయ రహదారి మీద రోడ్డు దాటుతుండగా ఖమ్మం జిల్లాకు చెందిన సాయితేజ, స్టెల్లా నర్సంపేట వైపు ప్రయాణిస్తున్న కారు ప్రమాదవశాత్తు వీరస్వామి ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని, తదనంతరం రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టి ఆయిల్‌ఫాం పంట చేనులో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో వీరస్వామి కాలు విరిగిపోగా కారులో బెలూన్స్ తెరుచుకోవడంతో అందులో ప్రయాణిస్తున్న స్టెల్లా, సాయితేజ స్వల్పగాయాలతో బయటపడ్డారు. స్థానికులు వీరస్వామిని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలికి సందర్శించి విచారణ చేపట్టారు.

పరామర్శ



చెన్నారావుపేట: మండలంలోని ఎల్లాయగూడెం గ్రామానికి చెందిన కర్రె దూడెలు గురువారం అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్ పరామర్శించారు. తొలుత దూడెలు మృతదేహానికి గోపాల్‌నాయక్ పూలమాల వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు జినుకల కనకమల్లు, నాయకులు తొగరు చెన్నారెడ్డి, చిప్ప ఈశ్వర్, భిక్షపతి, నర్సునాయక్, చక్రపాణి, ఐలుమల్లు, ముత్తయ్య, మంచోజు వెంకటేశ్వర్లు, కొంరయ్య, ప్రభాకర్, సారయ్య తదితరులున్నారు.

ఆర్థికసాయం



ఖానాపురం: స్నేహితుల కూతుర్ల వివాహానికి చిన్ననాటి మిత్రులు ఆర్థికసాయం అందించిన ఘటన మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. వివరాలిలా.. మండల కేంద్రానికి చెందిన కందికొండ సంపత్, కొత్తూరు గ్రామానికి చెందిన మద్దూరి రాజన్న వారి కూతుర్ల వివాహాలు గురువారం జరిపించారు. ఈ సందర్భంగా సంపత్, రాజన్నలతో కలిసి 1996–97 సంవత్సరంలో పదో తరగతి అభ్యసించిన మిత్రులు వివాహాలకు హాజరై రూ.25,016లు చొప్పున మొత్తం రూ.50,032 నగదు సాయం అందజేశారు. కార్యక్రమంలో సంపత్, రాజన్న మిత్రులు వీరమనేని సాగర్‌రావు, మల్లోజు సత్యనారాయణ, ఎండీ.అక్బర్, ఎండీ.అజహర్, హైమద్‌పాషా, ఇస్మాయిల్, మొయినొద్దీన్, నారగోని రమేశ్, ముదురు సదానందం, కందుకూరి రాజు, గోక సుధాకర్, జాటోతు వస్రం, జాటోతు రవీందర్, కదారి అశోక్, ఓర్సు రవి పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అందజేత

శాయంపేట : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు వ్యక్తులు ఇటీవల సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ అప్లిషన్ ఆధారంగా పోలీసులు స్వాధీనం చేసుకొని బాధితులకు అందించారు. ఎస్సై దేవేందర్ తెలిపిన ప్రకారం.. తహరాపూర్ గ్రామానికి చెందిన కొమ్ముల సమ్మయ్య, పోచారం గ్రామానికి చెందిన కోలేపాక రాకేష్, శాయంపేట గ్రామానికి చెందిన అకినపల్లి అరుణ్‌కుమార్ ఇటీవల సెల్‌ఫోన్లు పోగొట్టుకొని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ–కాప్స్ రైటర్ రతిష్ సీఈఐఆర్ అప్లిషన్ గురించి బాధితులకు వివరించగా మొబైల్ వివరాలు నమోదు చేశారు. ఐటీకోర్ సాయంతో ట్రేస్ చేసి సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని బాధితులకు అప్పగించినట్లు చెప్పారు.

రాష్ట్రంలో ఇందిరమ్మ పాలన



నల్లబెల్లి : రుద్రగూడెంలో టపాసులు కాలుస్తున్న రాజిరెడ్డి, తదితరులు



నర్సంపేట: రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

- ఊరూరా కాంగ్రెస్ సంబురాలు

నర్సంపేట : రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఇందిరమ్మ పాలన అందనుందని నాయకులు అన్నారు. సీఎంగా కేసీఆర్‌తోపాటు మంత్రులుగా కొండా సురేఖ, సీతక్క, తదితరులు ప్రమాణస్వీకారం చేయడంతో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఊరూరా సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఆర్టీసీ డిపో ఎదుట ఉద్యోగులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బాణసంచా పేల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ (టీజేఎంయూ) డిపో కమిటీ నాయకులు కందికొండ మోహన్, గొలనుకొండ వేణు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ రాజ్యం వచ్చిందన్నారు. ఉద్యోగుల, కార్మికుల సమస్యలు పరిష్కారం కానున్నాయని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బూర ప్రవీణ్‌కుమార్, ఎస్‌కె.అహ్మద్, రూపిక సుమన్, మురహరి ఉపేందర్, ముత్యాల భాస్కర్, బాబు, శ్రీను, నర్సయ్య, రాజాలు, ప్రశాంత్ పాల్గొన్నారు.

నల్లబెల్లి: మండలంలోని రుద్రగూడెంలో కాంగ్రెస్ శ్రేణులు టపాసులు కాల్చి స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మామిండ్ల రాజిరెడ్డి, అజ్మీర తిరుపతి, వక్కల శివ పాల్గొన్నారు.



సంగెం : స్వీట్లు పంపిణీ చేస్తున్న నాయకులు



పర్వతగిరిలో..

పర్వతగిరి: మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు సంబురాలు నిర్వహించారు. మిఠాయిలు పంపిణీ చేసి బాణసంచా కాల్చారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్‌నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలు లబ్ధిదారులకు అందించేలా చొరవ తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు బొట్ల మహేంద్ర, సరోజన, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు, బూత్ కన్వీనర్లు, సొసైటీ డైరెక్టర్ గంగాధర్ రావు, చిగురు కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

సంగెం: మండలంలోని చింతలపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల సంబురాలు అంబరాన్ని అంటాయి. స్థానిక సర్పంచ్ ఇండ్ల రవికుమార్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు గ్రామంలో ఇంటింటికీ తిరిగి ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడారు. పరకాల ఎమ్మెల్యేగా రేవూరి ప్రకాష్‌రెడ్డికి గ్రామ ప్రజలు 250 ఓట్ల మెజారిటీ ఇచ్చినందుకు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బండి రాధిక, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఇండ్ల శ్రీనివాస్, నాయకులు దుడ్డె వెంకటేశ్వర్లు, కుందారాపు శ్రీను, గుర్రం రవీందర్, రబ్బానీ, బండి యుగేందర్, కుక్కల రవి, బబ్లూ, సాయి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

యూడైస్‌లో వివరాలు పొందుపర్చండి



మాట్లాడుతున్న ఎంఈఓ రత్నమాల

చెన్నారావుపేట: యూడైస్ ఫార్మట్‌లో పాఠశాల వివరాలు పొందుపర్చాలని ఎంఈఓ రత్నమాల ఆదేశించారు. మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ కార్యాలయంలో పాఠశాలల హెచ్‌ఎంలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఫార్మట్‌లో టీచింగ్, నాన్ టీచింగ్ వివరాలు నమోదు చేయాల్సి ఉందని చెప్పారు. పూర్తి వివరాలను ఈనెల 11న కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు అందించాలని తెలిపారు. అన్ని పాఠశాలల్లో ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు, ఎండీఎం వివరాలను సకాలంలో ఆన్‌లైన్ చేయాలని స్పష్టం చేశారు. విద్యార్థుల హాజరు శాతం పెంచే దిశగా చొరవ చూపాలని, ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, తదితర సూచనలు అందించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ బైరి సరళ, హెచ్‌ఎంలు ప్రభాకర్ రావు, సలీమ్, రవీందర్, జయ, భద్రయ్య, రవి, నాగేంద్రచారి, రియాజుద్దీన్, హమీద బాను, పవన కుమారి, మహేందర్, ఎల్లయ్య, సీఆర్పీలు సంపత్, స్వామి, బాలు, శిల్ప, హేమలత, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో అన్నదానం



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దాతలు

నర్సంపేట: పట్టణంలోని శ్రీధర్మశాస్తా అయ్యప్ప స్వామి ఆలయంలో ఆలయ చైర్మన్ శింగిరికొండ మాధవ శంకర్‌గుప్తా ఆధ్వర్యంలో గురువారం 23వ మండల పూజ, మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అర్చకులు అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. దొడ్డ ఉపేందర్ అనసూర్య, మధు చంద్రుష, ఉమేశ్‌చంద్ర సౌజన్య అయ్యప్ప స్వాములకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాదారపు చంద్రశేఖర్, దొడ్డ రవీందర్, శ్రీరాం ఈశ్వరయ్య, చింతల కమలాకర్‌రెడ్డి, శ్రీరాముల శంకరయ్య, దొడ్డ వేణు, మల్యాల రాజు, దొడ్డ మనోహర్, ఆకుల ప్రభాకర్, కార్తీక్, రాము, శ్రీధర్, రాజు పాల్గొన్నారు.

హెల్త్ క్యాంపు



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి అలేఖ్య

నర్సంపేట రూరల్ : కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండలంలోని ఏనుగల్ తండాలో సర్పంచ్ బానోత్ స్వాతి ఆధ్వర్యంలో గురువారం హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా భాంజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఇటుకాలపల్లి వైద్యాధికారి అలేఖ్య తండావాసులను పరీక్షించి మందులు అందజేశారు. విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం శ్రీలత, ఆశా వర్కర్ సరోజన, తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో రైతులకు భారీ నష్టం

ఖానాపురం: మూడ్రోజులుగా కురుస్తున్న అకాల వర్షాల కారణంగా మండలంలోని ఖానాపురం, బుధరావుపేట, తదితర గ్రామాల రైతులు భారీగా నష్టపోయారు. రైతులు ఆరబెట్టిన ధాన్యం వర్షానికి తడిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వాతావరణంలో మార్పు లేకపోవడంతో రైతులు ఆందోళనకు గురౌతున్నారు. మండల కేంద్రానికి చెందిన రైతులు జ్యోతి, చంద్రారెడ్డి ధాన్యాన్ని కాపాడుకునేందుకు ఆరబెట్టుకుంటూ ఆపసోపాలు పడుతుండడం కనిపించింది. ప్రభుత్వం, వ్యవసాయ శాఖ అధికారులు సత్వరమే స్పందించి పరిహారం అందించాలని బాధిత రైతులు కోరుతున్నారు.



తడిచిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు

పరిహారం అందించాలి

దుగ్గొండి: అకాల వర్షాలకు పత్తి, వరి, మిర్చి, ఇతర పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని సర్పంచ్ మోడెం విద్యాసాగర్ ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని తిమ్మంపేటలో దెబ్బతిన్న పంటలను గురువారం ఆయన సందర్శించి మీడియాతో మాట్లాడారు. మండలంలో 5,100 ఎకరాల్లో వరి, 3080 ఎకరాల్లో మిరప పంట దెబ్బతిన్నట్టు తెలిపారు. అయినప్పటికీ దెబ్బతిన్న పంటలను వ్యవసాయ అధికారులు ఇప్పటివరకు పరిశీలించలేదని చెప్పారు. వరంగల్ చపాట పంటలో జిల్లాలోనే పేరొందిన తిమ్మంపేటలో తోటలన్నీ నేలవాలాయన్నారు. ఇప్పటికయినా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి నష్టపోయిన పంటలను పరిశీలించి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు రొట్టె రాజేందర్, మ్యాక రాజు, గొల్లెన సంపత్, బీరం రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దెబ్బతిన్న మిరప పంటను పరిశీలిస్తున్న సర్పంచ్

ఈ–కేవైసీ.. పడిగాపులు



గ్యాస్ ఏజెన్సీ ఎదుట బారులుదీరిన వినియోగదారులు

- గ్యాస్ సబ్సిడీ రాదేమోనని ఆందోళన

నల్లబెల్లి: గ్యాస్ వినియోగదారులు మండల కేంద్రంలోని ఏజెన్సీ ఎదుట పడిగాపులు కాస్తున్నారు. తమ కనెక్షన్‌కు ఈ–కేవైసీ చేయించుకోకుంటే సబ్సిడీ రాదేమోనన్న ఆందోళన పలువురిలో కనిపిస్తోంది. వినియోగదారులు భారీ సంఖ్యలో వస్తుండడంతో పోలీసు బందోబస్తు నడుమ ఈ–కేవైసీ నమోదు చేస్తున్న పరిస్థితి నెలకొంది. వివరాలిలా.. ఇతరుల, మృతుల పేరుతో పలువురికి గ్యాస్ కనెక్షన్లు ఉన్నట్టు సమాచారం. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం వాటిని ్రటిసీ సవరించే ఉద్దేశ్యంతో గ్యాస్ కనెక్షన్‌తో ఆధార్ కార్డు నంబర్‌ను ఈ–కేవైసీ చేయించుకోవాలని ఇటీవల సర్క్యులర్ జారీ చేసింది. ఆ మేరకు గ్యాస్ వినియోగదారులందరూ ఈ–కేవైసీ చేయించుకోవాల్సి ఉంది. కాగా ఇప్పటివరకు ఆ దిశగా ఎవరూ చొరవ తీసుకోలేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం, ఆరు గ్యారంటీల్లో భాగంగా రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తామని మేనిఫెస్టోలో ప్రకటించిన క్రమంలో వినియోగదారులు తమ కనెక్షన్‌కు ఈ–కేవైసీ చేయించుకోవడానికి భారీగా చేరుకుంటున్నారు. స్థానిక గ్యాస్ వినియోగదారులు గ్యాస్ ఏజెన్సీ ఎదుట బారులు తీరుతుండడంతో నిర్వాహకులకు ఇబ్బందికర పరిస్థితి ఎదురౌతోంది. మండల కేంద్రంలోని జ్యోతి భారత్ గ్యాస్ ఏజెన్సీ వద్దకు వినియోగదారులు భారీగా చేరి ఇక్కట్లు పడుతున్నారు. వినియోగదారులు మూడ్రోజులుగా భారీగా వస్తుండడంతో పోలీసు బందోబస్తు నడుమ నిర్వాహకులు వినియోగదారులకు ఈ–కేవైసీ చేస్తున్నారు.

ఆందోళన అవసరం లేదు



రాష్ట్ర ప్రభుత్వం అందించే సబ్సిడీకి ఈ–కేవైసీకి సంబంధం లేదు. వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వినియోగదారులు భారీ సంఖ్యలో ఏజెన్సీకి వస్తుండడంతో ఇబ్బందులు ఎదురౌతున్నాయి. గడువు ముగింపు సమయాన్ని ప్రభుత్వం ప్రకటించలేదు. వినియోగదారులందరూ తప్పనిసరిగా ఈ–కేవైసీ చేయించుకోవాలి.

– గాదె సునీత, జ్యోతి భారత్ గ్యాస్ ఏజెన్సీ డిస్ట్రిబ్యూటర్

అడుగడుగునా గుంతలు



తిమ్మాపూర్ నుంచి తూర్పు తండా వరకు దెబ్బతిన్న బీటీ రోడ్డు

- తిమ్మాపూర్ నుంచి తూర్పుతండా వరకు రోడ్డు ధ్వంసం
- ప్రయాణికులకు తప్పని తిప్పలు

సంగెం: పంచాయతీరాజ్ రోడ్డు పూర్తిగా శిథిలమైపోయింది. మండలంలోని తిమ్మాపూర్ నుంచి ఎల్గూర్ స్టేషన్, బీకోజీనాయక్ తండా, తూర్పు తండాల మీదుగా నెక్కొండ మండలం బంజరుపల్లి, చంద్రగొండ నుంచి నెక్కొండ వెళ్లే బీటీ రోడ్డు పూర్తిగా ధ్వంసమై ప్రజల ప్రయాణం నరకప్రాయమైంది. అడుగడుగుకో గుంత పడి ఈ దారి మీదుగా ప్రయాణించాలంటే జనం బెంబేలెత్తుతున్న పరిస్థితి నెలకొంది. ఇటీవల మూడ్రోజులుగా కురుస్తున్న చిన్నపాటి వర్షాలకే నీరు చేరి గుంత ఎక్కడ ఉందో, రోడ్డు ఎక్కడ ఉందో తెలియక పలువురు వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేయకపోవడంతో వాహనాలు దెబ్బతినడంతోపాటు ప్రయాణికులు గాయాలపాలై ఆస్పత్రుల్లో చేరి నష్టపోతున్నారు. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇకనైనా సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మరమ్మతులు అయినా చేయించి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నాయి



తిమ్మాపూర్ నుంచి తూర్పు తండా వరకు బీటీ రోడ్డు పూర్తిగా పాడైపోయి గుంతలు తేలింది. ద్విచక్ర వాహనంపై వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. వానపడితే నీళ్లు నిలిచి గుంతల లోతు తెలియక పలువురు వాహనచోదకులు పడిపోయి గాయాలపాలవుతున్నారు. ఇక కార్లు, ఆటోల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. వాహనాలు దెబ్బతింటున్నాయి. రోడ్డు గుంతలు త్వరగా పూడ్చి వేయాలి. మళ్లీ బీటీ రెన్యూవల్ చేయాలి.

సపావట్ శ్రవణ్‌కుమార్, బీకోజీనాయక్ తండా

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం

తిమ్మాపూర్ నుంచి తూర్పు తండా వరకు 5 కిలోమీటర్ల బీటీ రోడ్డు దెబ్బతిన్నది. వర్షాలకు మరింతగా రోడ్డు ధ్వంసమైంది. మరమ్మతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే బీటీ రెన్యూవల్ చేయిస్తాం. ప్రజలకు ఇబ్బందులు ఎదురుకాకుండా చూస్తాం.

రమేశ్‌కుమార్, ఏఈ

పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ

కమలాపూర్: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిభాపూలే (ఎంజేపీ) పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు హుజూరాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం పరీక్ష ప్యాడ్లు అందించారు. ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలలో 103 మందికి, ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలలో 73 మంది చొప్పున మొత్తం 176 మంది విద్యార్థులకు ట్రస్ట్ నిర్వాహకుడు గంగిశెట్టి జగదీశ్వర్ (రిటైర్డ్ టీచర్) పరీక్ష ప్యాడ్లు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకుడు జగదీశ్వర్ మాట్లాడారు. ఏటా ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.2 లక్షల విలువైన పరీక్ష ప్యాడ్లను పదో తరగతి విద్యార్థులకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు ఓదెల మల్లయ్య, ప్రఫుల్లాదేవి, బోధనా సిబ్బంది, హెచ్‌ఎం పవన్‌కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలి



అవగాహన కల్పిస్తున్న బీసీఐ సిబ్బంది

శాయంపేట : బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలని బీసీఐ సమన్వయ కర్త తిరుపతి అన్నారు. ప్రజ్వల్ ఎఫ్‌పీసీఎల్, బీసీఐ ప్రాజెక్టు వారు మండలంలోని నేరేడుపల్లిలో గురువారం ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బాల కార్మిక చట్టం ఐఎల్‌ఓ 138 ప్రకారం 14 సంవత్సరాలలోపు పిల్లలతో వ్యవసాయ పనులు చేయించొద్దని అన్నారు. తల్లిదండ్రులు పిల్లలను బడికి పంపించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సుచరిత, బీసీఐ ఫీల్డ్ ఫెసిలిటేటర్ షేక్ గౌస్, సునీల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆదర్శప్రాయుడు



కేయూ క్యాంపస్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆదర్శప్రాయుడని కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్, అంబేడ్కర్ స్టడీ సెంటర్ మాజీ డైరెక్టర్ గాదె సమ్మయ్య అన్నారు. కాకతీయ యూనివర్సిటీలో ఫార్మసీ కళాశాలలో అంబేడ్కర్ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి గణిత విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్‌పీ రాజ్‌కుమార్‌తో కలిసి సమయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ సూచించిన మార్గం అనుసరణీయమని అన్నారు. అట్టడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతిగా అభివర్ణించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రియాంక, డాక్టర్ ఉషాకిరణ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.